# 14. నవాబుగారి త్యాగం!

అల్వార్ సంస్థానాధీశులైన హిజ్ హైనెస్ హిజ్ హోలినెస్ మహారాజా జయసింహాజీవారు సాక్షాత్తూ పురాణ పురుషులూ, సూర్యవంశీకులూనైన శ్రీరామచంద్రులవారి వారసులు. అలా అని శ్రీవారు కోరి మరీ తయారుచేయించుకున్న వారి వంశ చరిత్ర తిరుగులేని సాక్ష్యం ఇస్తున్నది. అంతేగాదు, శ్రీవారు స్వయంగా రామాయణంలో వర్ణించబడిన శ్రీరాముల వారి వేష భూషణాలనే సదా ధరించేవారు.

శ్రీవారు నిజంగా శ్రీరామచంద్రులే కనీసం ఏకపత్నిని కూడా కన్నెత్తి చూసేవారు కారు. మహారాణులూ రాణులూ అంతఃపుర స్త్రీలూ శ్రీవారి పొందు అందక రాణీవాసంలో మగ్గిపోతుండేవారు.

అందుకని శ్రీవారు తరచుగా బ్రహ్మాండమైన విందులు అంతఃపురంలోనే ఏర్పాటు చేస్తుండేవారు. వాటికి మంత్రులూ, సేనానులూ అతిముఖ్యులైన ఆస్థానోద్యోగులూ సతీసమేతంగా ఆహ్వానింప బడేవారు. రుచికరమైన ఆహారంతో పాటుగా ఖరీదైన మధ్యాలూ విరివిగా అక్కడే వడ్డించబడ్డావి. నిషా తలకెక్కిన తరువాత ఆయా ప్రముఖులు హద్దులు దాటిపోయి తమ కిష్టులైన అంతఃపుర స్త్రీలతోనూ, తోటివారి స్త్రీలతోను యధేచ్ఛగా రాసక్రీడల్లో మునిగిపోయేవారు.

మహారాజా జయసింహాజీ వారికి ఈ విషయం స్పష్టంగానే తెలుసు. కనుకనే శ్రీవారు విందులకు అందర్నీ సతీ సమేతంగానే రావాలని పట్టుబట్టేవారు. తన అంతఃపుర స్త్రీలు "చెడి"పోతేనేం గాక! మిగతావారి

స్త్రీలూ చెడిపోతున్నారుగదా అని శ్రీవారు సరిపెట్టుకునేవారు కనుక, ఈ ఘనమైన విందులకు అలవాటు పడిపోయిన ఎవరికీ కూడా ఈ విశృంఖలత అభ్యంతరకరంగా కనుపించేదిగాదు.

కానీ... !

శ్రీవారివద్ద రెవిన్యూ మంత్రిగా ఘజ్నఫర్ ఆలీఖాన్ అనే అనుభవజ్ఞుడైన మొగల్ వంశీకుడుండేవాడు. ఇతనే తరువాతి కాలంలో భారత దేశంలో పాకిస్తాన్ హైకమీషనర్‌గా పనిచేశాడు కూడా. అతను మహారాజా వారికి అతియిష్టుడైన పరిపాలనా దక్షుడు. మనిషి మహా అందగాడు. భారీ మనిషి. అందువల్ల సహజంగానే అతను ఈ విందుల్లో సుందరాంగుల దృష్టిని సదాహసంగా ఆకట్టుకువాడు. దాదాపు రాచ కుటుంబీకులైనే స్త్రీలందరితోనూ అతను సన్నిహిత సంబంధాలు నెలకొల్పుకున్నాడు. అంతఃపురంలో ఆతనికి ప్రత్యేక విలువ ఉండేది

ఇతనిలా ప్రముఖుడై పోవటం, తమ స్త్రీలతో స్వేచ్ఛగా విహరించటం, విందులకు వచ్చే మిగిలినవారికి మింగుడు పడటంలేదు. ఎందుకంటే, వారందరూ తమ స్త్రీ జనాన్ని విందులకు తీసుకు వస్తున్నారు. వారు ఎవరితో, పోతున్నా చూసీ చూడనట్లూరుకొని తాము తమకిష్టమైన వారితో పోతున్నారు. కానీ, ఘజ్నఫర్ ఆలీఖాన్‌గారు మాత్రం తన ముస్లిం సాంప్రదాయాల పేరుతో తన రాణివాసపు స్త్రీల నెవరినీ ఈ విందులకు తీసుకు వచ్చేవారు కారు. తను మాత్రం అందర్నీ అనుభవించేవారు.

అందుకని......

మిగిలిన వారంతా కలసి ఓ రహస్య సమావేశంలో ఈ విషయం చర్చించి మహారాజా వారికి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. మహారాజా వారు మొదట సాంప్రదాయాల పేరుతో తటపటాయించినా, వినగా

వినగా వారికి వీరి వాదం సబబే ననిపించింది. కనుక మరుసటి విందుకు సతీ సమేతంగా హాజరు కావలసిందిగా ఘజ్నఫర్ అలీఖాన్‌ను శ్రీవారు ఆదేశించారు. మహారాణీయే విందులకు హాజరవుతున్నపుడు ఓ రెవిన్యూ మంత్రికి మినహాయింపు ఇస్తే తనది రామరాజ్యం ఎలా అవుతుందని శ్రీవారు నిలదీసి అడిగారు.

ఫలితంగా ఘజ్నఫర్ అలీఖాన్ పని సంకటంలో పడింది. ఉద్యోగం వదులుకుని పోలేడు, భార్యను, ఘోషా వదిలించి తీసుకురానూలేడు. ఎలా?

అందుకని నెలరోజులు శెలవడిగి పుట్టింట ఉన్న భార్యను తీసుకు వస్తానని చెప్పి లాహోరుకు ప్రయాణమయ్యాడు. దీపావళినాడు విందు. దీపావళి మరో నెల రోజుల్లో ఉంది. మహారాజావారున్నూ తన మాటను మన్నించినందుకు సంతోషించి ఖర్చులకోసమని అక్షరాలా పదివేల రూపాయలిచ్చి రెవిన్యూ మంత్రిని అత్తవారింటికి సాగనంపేరు.

మంత్రిగారు దారిలో ఢిల్లీలో ఆగినపుడుతన అంతరంగికుడైన ఓ మిత్రునికి తన బాధనంతా వెళ్ళబోసుకుని పరిష్కారంకోసం ప్రాధేయ పడగా...!

అతనో ఘనమైన మార్గం సూచించేడు. వారిద్దరూ కలసి ఆ రాత్రంతా అక్కడి వేశ్యావాటికలన్నీ కలియ దిరిగారు. చివరకో చాకు లాంటి, అప్సరసలాంటి, చదువు కున్న నాట్యకత్తె వారికి నచ్చింది. ముస్లిం సాంప్రదాయ ప్రకారం ఎవరికైనా తాత్కాలిక వివాహాలు నిషిద్ధం కాదు. కనుక ఆమె తల్లిదండ్రులతో మాట్లాడి అక్కడికక్కడ మంత్రిగా రామెను వివాహమాడి, అందుకుగాను ఆ పదివేల రూపాయలు ఆమె తల్లిదండ్రుల కిచ్చి ఆమెను తన మిత్రుని ఇంటికి తీసుకు వచ్చారు.

ఆమెకు విషయాలన్నీ వివరించి, మహారాజావారి విందులో ఎలా

మసలుకోవాలో నేర్పి తయారుచేసారు. అలాంటి విషయాల్లో అదివరకే ఆరితేరిన ఆ నర్తకి చిరునగవుతో అన్నీ నేర్చేసుకుంది.

మంత్రిగారూన్నూ తృప్తిగా శ్వాస తీసుకుని, అత్తవారింటికెళ్ళి భార్యతో ఓ వారం గడిపి మరలా ఢిల్లీకి తిరిగివచ్చి ఈ క్రొత్త భార్యతో రైలెక్కి మహారాజావారికి టెలిగ్రాం కొట్టారు.

మహారాజా వారున్నూ, విశ్వాస పాత్రుడైన తన మంత్రి చేస్తున్న త్యాగానికి మహదానంద పడిపోయారు. రైల్వే స్టేషన్‌లో ఘనస్వాగతం ఇచ్చి మంత్రిని ఆలింగనం చేసుకుని తన స్వర్ణ రథంలో మంత్రినీ అతని బేగంనూ వారి నివాసానికి సాగనంపారు. సిల్కు బురఖాలోనున్న మంత్రిగారి భార్య అందాన్ని ఎప్పుడు చూస్తామా? అని అందరూ తహ తహలాడిపోయారు.

ప్రసిద్ధులైన ఘజ్నఫర్ అలీఖాన్‌గారి సౌందర్యరాసియైన సతీమణి కూడా హాజరవుతోందని కాబోలు ఆ దీపావళి విందుకు ఆహ్వానితులందరూ మామూలుకన్నా ఎక్కువగా అలంకరించుకుని సకుటుంబంగా సుగంధాలు వెదజల్లుతూ హాజరయ్యారు.

అందరూ ఆశించినట్లు మంత్రిగారి బేగం అద్భుత సౌందర్యవతి మాత్రమే గాదు. అలంకరణలో అత్యంతాధునికురాలు. ఎవరితో ఎలా మెసలాలో తెలిసిన జాణ. ఆ రాత్రి ఆవిడ ఆ విందులోని వారందర్నీ ఒక్క ఊపు ఊపివేసింది. అందర్నీ ఆకట్టుకుంది. మహారాజావారి చేత శెభాష్ అనిపించుకుంది.

సంతోషించిన మహారాజావారు మర్నాడు మంత్రిగారికీ, బేగంకూ వజ్రవైడూర్యాలు, పట్టు చీనాంబరాలు, ఆదిగాగల విలువైన కానుకలెన్నో పంపారు. అవిగాక బొంబే, కలకత్తా షాపులలో తమకు నచ్చిన అలంకా

రాలు కోనుక్కోవలసిందిగా కోరుతూ అక్షరాలా 5 లక్షల రూపాయలు కూడా పంపారు.

మంత్రిగారున్నూ అవన్నీ సంతోషంగా సంచీలో వేసుకుని, బేగం తోసహా బొంబాయి, కలకత్తాలకు బయలు దేరారు.

కలకత్తా చేరగానే మంత్రిగారు అనుకున్న ప్రకారం మహారాజా వారికి టెలిగ్రాం ఇచ్చారు. తన బేగం అకస్మాత్తుగా అపెండిటిస్‌తో మంచాన పడిందనీ, ఆపరేషన్ జరగవలసి ఉన్నదనినూ. విచారంతో నున్న మహారాజావారికి వారంరోజుల తరువాత మరో టెలిగ్రాం అందింది. ఆపరేషన్ జరిగి బేగం మరణించిందని.

మహారాజావారున్నూ, వారి అంతరంగికులున్నూ అందుకెంతో దుఃఖించారు. మంత్రిగారికి సానుభూతి తెలుపుతూ టెలిగ్రాముల వర్షం కురిపించారు. వారెవరూ కూడా ఆ అప్సరసనూ, ఆవిడ ఒక్కరోజులో తమందరికీ అందించిన ఆనందాన్నీ ఆ జన్మాంతం మరచిపోలేరు.

మంత్రిగారు మాత్రం కొంత కాలానికి సకుటుంబంగా తిరిగివచ్చి హిజ్ హైనెస్, హిజ్ హోలినెస్ మహారాజా జయసింహజీ వారికి, ప్రీతి పాత్రుడూ, విశ్వాసనీయుడూనైన రెవిన్యూ మంత్రిగా మరికొంత కాలం రాణివాసంతో సుఖించారు.

★